సాక్షి కామారెడ్డి

మంగళవారం । 7 । మార్చి । 2023



ఫిర్యాదులను పరిష్కరించాలి

కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణికి 51 ఫిర్యాదులు వచ్చాయి. అదనపు కలెక్టర్ చంద్రమోహన్ ఫిర్యాదులు స్వీకరించారు.

- 8లో ▸



పఠనాసక్తి పెంచుకోవాలి

ప్రతి ఒక్కరూ పుస్తకాలను చదవడాన్ని అలవాటు చేసుకోవాలని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ సూచించారు.

- 9లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
36.3 /15.0

ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. పగటిపూట ఎండ తీవ్రత కొనసాగుతుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

9న దిశ సమావేశం

కామారెడ్డి అర్బన్: కలెక్టరేట్‌లో గురువారం ఉదయం 11 గంటలకు జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ(డీడీసీఎంసీ-దిశ) సమావేశం నిర్వహించనున్నారు. ఎంపీ బీబీ పాటిల్ అధ్యక్షతన దిశ సమావేశం నిర్వహించనున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి పనులపై సమీక్ష ఉంటుందని, జిల్లాలోని శాసన సభ్యులు, అధికారులు, ఎంపీపీలు పాల్గొనాలని కోరారు.

5,416 మందికి కంటి పరీక్షలు

కామారెడ్డి టౌన్: జిల్లాలో కంటి వెలుగులో భాగంగా సోమవారం 5,416 మందికి కంటి పరీక్షలు చేశారు. 836 మందికి అద్దాలను అందించారు. ఇప్పటివరకు 1,80,446 మందికి కంటి పరీక్షలు నిర్వహించామని, 28,863 మందికి కంటి అద్దాలను పంపిణీ చేశామని వైద్యాధికారులు తెలిపారు.

చెస్ క్రీడాకారుడికి సన్మానం



భిక్కనూరు: జాతీయ స్థాయి చెస్ టోర్నీకి ఎంపికైన భిక్కనూరులోని తెలంగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్ విద్యార్థిని సోమవారం సన్మానించారు. క్యాంపస్‌లో జియో ఇన్ఫర్మాటిక్స్ చదువుతున్న గోపాల్ ఇటీవల డిచ్‌పల్లిలోని తెలంగాణ యూనివర్సిటీలో నిర్వహించిన ఇంటర్ కాలేజ్ చెస్ టోర్నమెంట్‌లో సత్తా చాటాడు. బంగారు పతకాన్ని సాధించి, జాతీయ స్థాయి టోర్నీకి ఎంపికయ్యాడు. త్వరలో చెన్నైలో నిర్వహించే జాతీయ స్థాయి టోర్నీలో పాల్గొననున్నాడు. ఈ సందర్భంగా సోమవారం సౌత్ క్యాంపస్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కవితా తురాన్ విద్యార్థిని సన్మానించారు. కార్యక్రమంలో సౌత్ క్యాంపస్ స్పోర్ట్స్ ఇన్‌చార్జి సుధాకర్‌గౌడ్, ఆచార్యులు ప్రతిజ్ఞ, ఎస్.నారాయణ, ఫిజికల్ డైరెక్టర్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలంకు బస్సు సౌకర్యం కల్పించాలి



బాన్సువాడ టౌన్: బాన్సువాడ నుంచి భద్రాచలం పుణ్యక్షేత్రానికి బస్సు సౌకర్యం కల్పించాలని హనుమాన్ దీక్షాధారులు సోమవారం బాన్సువాడ ఆర్టీసీ డీఎం సదాశివ్‌కు వినతిపత్రం ఇచ్చారు. శ్రీరామ నవమికి భక్తులు భద్రాచలం వెళ్లేందుకు బస్సు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో భక్తులు ఉమామహేష్, సాయగౌడ్, రాజు, శంకర్ గౌడ్, తులసీరాం, శ్రీనివాస్, ప్రశాంత్, యాదవ్, ధనుంజయ్ తదితరులున్నారు.

క్రెడా కార్యవర్గం..



కామారెడ్డి అర్బన్: కామారెడ్డి రియల్ ఎస్టేట్ డెవలపర్స్, ఏజెంట్స్ అసోసియేషన్ (క్రెడా) అధ్యక్షుడిగా పిట్ల రాములు, ప్రధాన కార్యదర్శిగా కల్లెం సత్యం, కోశాధికారిగా కొత్త భీంరాజు ఎన్నికయ్యారు. వీరి పదవీకాలం రెండేళ్లని ఎన్నికల అధికారి శ్రీధర్ తెలిపారు.

తూకంలో మోసంపై ఆగ్రహం

సాక్షి, కామారెడ్డి: పత్తి కొనుగోళ్లలో తూకంలో మోసానికి పాల్పడుతున్న వ్యాపారులను రైతులు పంచాయతీలో నిర్బంధించారు. వివరాలిలా ఉన్నాయి. సదాశివనగర్ మండలం వజ్జేపల్లిలో సోమవారం రాత్రి వ్యాపారులు పత్తి కొనుగోలు చేశారు. పత్తిని తూకం వేసే క్రమంలో మోసానికి పాల్పడినట్లు అనుమానించిన పలువురు రైతులు.. వ్యాపారులను వెంబడించి పట్టుకున్నారు. ఎలక్ట్రానిక్ కాంటా పేరుతో మోసం చేస్తున్నట్లు గుర్తించి ఐదుగురు వ్యాపారులను పంచాయతీలో నిర్బంధించారు. అనంతరం సదాశివనగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

నేడు జిల్లాకు వర్ష సూచన

రుద్రూర్: ఉమ్మడి జిల్లాలో మంగళవారం ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి వర్షం కురిసే అవకాశం ఉంది. ఈ విషయాన్ని రుద్రూర్ కృషి విజ్ఞాన కేంద్రం వ్యవసాయ వాతావరణ విభాగం శాస్త్రవేత్త శ్రీలక్ష్మి తెలిపారు.

ఆణిముత్యాలు..

- కళల్లో రాణిస్తున్న బాలికలు, యువతులు
- ఆట, పాట, మాట, నటనలలో తమదైన ముద్ర



ఒకప్పుడు ఆడపిల్లంటే చులకన భావం ఉండేది. ప్రతిభ ఉన్నా ప్రోత్సహించేవారు అరుదు. అడుగడుగునా ఆటంకాలు కల్పించేవారెందరో ఉండేవారు. కానీ కాలం మారుతోంది. నేటి తల్లిదండ్రులు తమ కూతుళ్లకు అండగా ఉంటున్నారు. వారు ఇష్టపడ్డ రంగంలో వెన్నుతట్టి ప్రోత్సహిస్తున్నారు. దీంతో ఆడబిడ్డలు అన్ని రంగాల్లో సత్తా చాటుతూ ఆదర్శంగా నిలుస్తున్నారు. బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జిల్లాకు చెందిన పలువురు విద్యార్థినులు, యువతులు సాధించిన విజయాలపై కథనం..

– సాక్షి, కామారెడ్డి

విదేశీ గడ్డపై సాన్వి..

తాడ్వాయి మండలం కన్‌కల్‌కు చెందిన సాన్వి తల్లిదండ్రులు గతంలో సౌత్‌ఆఫ్రికాలో ఉండేవారు. ఇటీవల అమెరికాలోని టెక్సాస్‌కు మారారు. సాన్వి తల్లిదండ్రుల ప్రోత్సాహంతో కూచిపూడి, భరత నాట్యం నేర్చుకుంది. పలు వేదికలపై ప్రదర్శనలు ఇచ్చి ప్రశంసలు అందుకుంది. ఈత పోటీల్లోనూ సత్తా చాటుతూ విదేశీ గడ్డపై మనదేశ కీర్తిని ఇనుమడింపజేస్తోంది.

భళా.. లాస్య నృత్యం..



కామారెడ్డి పట్టణంలోని సీఎస్ఐ కాలనీకి చెందిన లాస్య చదువుతోంది తొమ్మిదో తరగతే.. కానీ ఆమె తన నృత్యంతో భళా అనిపించుకుంటోంది. జానపద నృత్యంతో యూట్యూబ్‌ను షేక్ చేస్తోంది. పసి ప్రాయంలోనే ఫోక్ డ్యాన్స్‌పై ఆసక్తిని గమనించిన తల్లిదండ్రులు ఆమెను ప్రోత్సహించారు. చదువుతూనే షూటింగ్‌లకు వెళ్తోంది. తను చేసిన డ్యాన్సులన్నీ యూట్యూబ్‌లో రచ్చ చేస్తున్నాయి. ఇప్పటివరకు 70 పాటలపై డ్యాన్స్ చేసిన లాస్య.. లక్షలాది మంది అభిమానులను సంపాదించుకుంది.

జానపద నృత్య 'కీర్తన'ం



మాచారెడ్డి మండల కేంద్రానికి చెందిన పడకంటి కీర్తన జానపదంలో వినోదాన్ని పంచుతోంది. ఆమె నృత్యంతో పాటు జానపద గేయాలు పాడడంలోనూ గుర్తింపు పొందింది. అనేక ఫోక్ సాంగ్స్‌పై నృత్యాలు చేసింది. యూట్యూబ్‌లో ఆమె పాటలు హల్‌చల్ చేస్తున్నాయి. ఇంటర్ వరకు చదువుకున్న కీర్తన.. నృత్యంతోపాటు పాడడంపై మక్కువతో దృష్టినంతా దీనిపైకే కేంద్రీకరించింది. యూట్యూబ్‌లో వేలాది మంది ఆమె నృత్యాన్ని, పాటలను ఆస్వాదిస్తున్నారు.

మాటలతో మంత్రముగ్ధులను చేస్తున్న 'మౌనిక'



యూత్ పార్లమెంట్‌కు ఎంపికై భారత పార్లమెంట్ సెంట్రల్ హాల్ వేదికగా తన గొంతు వినిపించిన కెతావత్ మౌనికది బాన్సువాడ మండలం పోచారం గ్రామం. ఆమె కామారెడ్డి పట్టణంలోని ఆర్‌కే కాలేజీలో పీజీ చదువుతోంది. చదువుతో పాటు చురుకైన ప్రసంగాలతో కాలేజీలో అందరి మన్ననలను అందుకున్న ఆమె ఇటీవల యూత్ పార్లమెంట్‌కు ఎంపికైంది. లభించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో ప్రసంగించి ప్రశంసలు అందుకుంది.

యుద్ధ క్రీడల్లో 'ప్రతిభ'..



పిట్లం మండలం తక్కడపల్లికి చెందిన ప్రతిభ బాక్సింగ్, కిక్ బాక్సింగ్, థైక్వాండో, వుషూ, చెస్ బాక్సింగ్, మౌతాయ్‌తోపాటు అథ్లెటిక్స్‌లోనూ సత్తా చాటుతోంది. బ్రిటన్, చైనాల్లో జరిగిన పలు పోటీల్లో గోల్డ్ మెడల్స్ సాధించింది. ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్–2022, జాకి బుక్ ఆఫ్ టాలెంట్స్–2021 రికార్డులు నమోదు చేసింది. సౌత్ ఏషియన్ ఇంటర్నేషనల్ చాంపియన్‌షిప్‌లో గోల్డ్ మెడల్ సాధించింది. ప్రపంచ పోటీల్లోనూ దేశ కీర్తిని చాటాలన్న లక్ష్యంతో సాగుతోంది.

బుల్లితెరపై ఫైమా చమక్కులు



దోమకొండ మండల కేంద్రంలో పేద కుటుంబంలో జన్మించిన ఫైమా.. బుల్లి తెర స్టార్‌గా ఎదిగింది. కామారెడ్డి పట్టణంలోని సాందీపని కాలేజీలో చదువుతున్న సమయంలో కళాశాలనుంచి టూర్‌కు వెళ్లిన సమయంలో ఆమె చేసిన కామెడీ అందరినీ ఆకట్టుకుంది. స్నేహితులు, కళాశాల అధ్యాపకులు ఆమెను ప్రోత్సహించారు. వారి ప్రోత్సాహంతో వివిధ ఎంటర్‌టైన్‌మెంట్ చానళ్లలో ప్రోగ్రామ్‌లకు వెళ్లింది. అక్కడ సక్సెస్ కావడంతో ఓ చానల్ నిర్వహించిన బిగ్‌బాస్ ఆరోసీజన్‌లో అవకాశం లభించింది. బిగ్‌బాస్ హౌస్‌లో చాలా రోజుల పాటు ఉన్న ఫైమా.. హీరో నాగార్జున అభిమానాన్ని చూరగొంది. నాగార్జున ఆమెను ప్రతిసారి ఆటపట్టించేవాడు. తర్వాత పలు టీవీలు నిర్వహించే షోలలో తన కామెడీతో అలరిస్తూ బుల్లితెర స్టార్‌గా ఎదిగింది.

పర్వతారోహణలో 'వెన్నెల'..



మాచారెడ్డి మండలం సోమారంపేటకు చెందిన గిరిజన బిడ్డ వెన్నెల కామారెడ్డి పట్టణంలోని సాందీపని కాలేజీలో చదువుతోంది. మట్టిని కాపాడుకోవాలని 'సేవ్ సాయిల్' పేరుతో ఐదు వేల కిలోమీటర్ల సైకిల్ యాత్ర చేసింది. ఇటీవల కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించిన వెన్నెల.. ఎవరెస్టు పర్వతాన్నీ అధిరోహించాలని తపన పడుతోంది. దీనికి ముందు మరిన్ని పర్వతాలు ఎక్కాల్సి ఉంటుంది. ఎన్ని కష్టాలెదురైనా అధిగమించి లక్ష్యాన్ని చేరుకోవాలన్న సంకల్పంతో సాగుతోంది.

నిజాంసాగర్ నీటి విడుదల నిలిపివేత



నిజాంసాగర్: నిజాంసాగర్ ప్రాజెక్టునుంచి ప్రధాన కాలువకు నీటి విడుదలను సోమవారం నిలిపివేశారు. ప్రాజెక్టునుంచి ఆయకట్టుకు ఇప్పటివరకు నాలుగు విడతల్లో 7.537 టీఎంసీల నీరందించారు. మొదటి దఫా డిసెంబర్ 14 నుంచి జనవరి 1 వరకు 2.493 టీఎంసీల నీటిని ప్రధాన కాలువకు విడుదల చేశారు. రెండో విడతలో జనవరి 13 నుంచి జనవరి 23 వరకు 1.365 టీఎంసీలు అందించారు. మూడో విడతలో గతనెల 2 నుంచి 13 వ తేదీ వరకు 1.714 టీఎంసీలు వదిలారు. గతనెల 23 నుంచి ఈ నెల 6 వ తేదీ వరకు నాలుగో విడతలో 1.963 టీఎంసీల నీటిని విడుదల చేశారు.

మరో రెండు విడతలు..

నిజాంసాగర్ పూర్తిస్థాయి నీటిమట్టం 1,405 అడుగులు(17.8 టీఎంసీలు) కాగా.. సోమవారం సాయంత్రానికి 1,397.04 అడుగుల(8.462 టీఎంసీలు) నీరుంది. ఆయకట్టుకు ఇప్పటివరకు నాలుగు విడతల్లో నీటిని విడుదల చేశారు. ఇంకా రెండు విడతల నీరివ్వడానికి నాలుగు టీఎంసీల వరకు అవసరం. దీంతో ప్రాజెక్టు నీటిమట్టం నాలుగు టీఎంసీలకు పడిపోయే అవకాశాలున్నాయి.

కామారెడ్డి కళాశాలలో 'సిర్నాపల్లి సంస్థాన్'



కళాశాల గ్రంథాలయంలో సన్నివేశాన్ని చిత్రీకరిస్తున్న దృశ్యం

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో సోమవారం సిర్నాపల్లి సంస్థాన్ అనే సినిమా షూటింగ్ నిర్వహించారు. కళాశాల ప్రాంగణంతో పాటు కారిడార్, గ్రంథాలయంలలో కథానాయకులు మను, శ్రీనివాస్, కథానాయికలు జ్యోతియాదవ్, స్మృతిపాండేలపై పలు సన్నివేశాలను చిత్రీకరించారు. చిత్రీకరణను కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు. సిర్నాపల్లి ప్రాంతంలో జరిగిన ఓ యథార్థ సంఘటన ఆధారంగా చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు దర్శక, నిర్మాతలు రమేష్ మంచాల, మునీశ్వర్ తెలిపారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

- కలెక్టర్ జితేష్ వి పాటిల్
- కలెక్టరేట్‌లో మహిళా దినోత్సవం



సన్మానం పొందిన మహిళలతో కలెక్టర్ జితేష్ వి పాటిల్

కామారెడ్డి టౌన్: జిల్లా మహిళలు స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధి సాధించి రాష్ట్ర స్థాయిలో ఆదర్శంగా నిలవాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం టీఎన్జీవోస్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చేపలు, తేనెటీగల పెంపకం, డ్రోన్ యంత్రం ద్వారా పురుగు మందుల పిచికారి వంటివాటితో జిల్లా మహిళలు స్వయం సమృద్ధిని సాధిస్తున్నారన్నారు. మహిళా ఉద్యోగులు పనిచేసే చోట, బహిరంగ ప్రదేశాల్లో వేధింపులకు గురి అయితే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఉత్తమ సేవలందించిన మహిళా ఉద్యోగులను సన్మానించి జ్ఞాపికలను అందించారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో జిల్లా టీఎన్జీవోస్ అధ్యక్షుడు వెంకటరెడ్డి, కార్యదర్శి బి.సాయిలు, ప్రతినిధులు దేవరాజు, సంతోష్ కుమార్, లక్ష్మణ్, రాజ్యలక్ష్మి, కల్పన, సుజాత తదితరులు పాల్గొన్నారు.

'అన్ని రంగాల్లో రాణించాలి'



ఆర్టీసీ మహిళా ఉద్యోగులు, ప్రయాణికులతో డీటీవో వాణి

కామారెడ్డి టౌన్: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని జిల్లా రవాణాశాఖ అధికారి వాణి సూచించారు. సోమవారం కామారెడ్డి ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆము మాట్లాడుతూ సమాజంలో మార్పు వస్తోందని, పలు రంగాలలో మహిళలు పురుషులతో సమానంగా రాణిస్తున్నారని పేర్కొన్నారు. అనంతరం డిపో ఆవరణలో మహిళా ఉద్యోగులకు క్రీడా పోటీలు నిర్వహించారు. నిత్యం బస్‌లో ప్రయాణిస్తున్న మహిళలకు, క్రీడల్లో విజేతలుగా నిలిచిన మహిళా ఉద్యోగులకు జ్ఞాపికలు, ప్రశంస పత్రాలను అందించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ లక్కు మల్లేశం, ఏఈ వసుంధర, కండక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ పోలీసులు దేశానికే ఆదర్శం

- రాష్ట్రంలో శాంతి భద్రతలకు ఢోకా లేదు
- హోం శాఖ మంత్రి మహమూద్ అలీ
- బాల్కొండలో నూతన పోలీస్‌స్టేషన్ భవనం ప్రారంభం



బాల్కొండలో పోలీస్ స్టేషన్ భవనాన్ని ప్రారంభిస్తున్న హోం మంత్రి మహమూద్ అలీ, ప్రశాంత్‌రెడ్డి

బాల్కొండ: శాంతి భద్రతల పరిరక్షణలో తెలంగాణ పోలీసులు దేశానికే ఆదర్శమని రాష్ట్ర హోం శాఖ మంత్రి మహమూద్ అలీ అన్నారు. సోమవారం బాల్కొండ మండల కేంద్రంలో నూతన పోలీస్ స్టేషన్ భవనాన్ని ఆర్‌అండ్‌బీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, డీజీపీ అంజనీకుమార్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా హోంమంత్రి మీడియాతో మాట్లాడారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తరువాత రాష్ట్రంలో పోలీసుల పనితీరు మారిందన్నారు. పోలీసు స్టేషన్‌ల నిర్వహణ ఖర్చు అర్బన్ ఏరియాల్లో నెలకు రూ.75 వేలు, రూరల్ ఏరియాల్లో రూ. 15 వేలు ప్రభుత్వం అందిస్తోందన్నారు. ఇది దేశంలో ఎక్కడా లేదన్నారు. దేశంలోనే బడ్జెట్‌లో మిగులు రాష్ట్రంగా తెలంగాణ ఉందన్నారు. రాష్ట్రం ఏర్పడిన తరువాత రూ. 9,598 కోట్లు వెచ్చించి నూతన పోలీస్‌స్టేషన్‌లను ప్రభుత్వం నిర్మించిందన్నారు. పోలీస్ శాఖలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అన్నారు. ఇచ్చిన మాట నిలబెట్టుకున్న గొప్ప నాయకుడు సీఎం కేసీఆర్ అన్నారు. సీఎం కేసీఆర్ విజన్ చాలా గొప్పదని, అందుకే 33 జిల్లాలను ఏర్పాటు చేసి పారదర్శక పాలనకు శ్రీకారం చుట్టారన్నారు. నూతన సచివాలయం నిర్మించడంలో రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి కృషి ఎంతో ఉందన్నారు.

శాంతి భద్రతలకు నిలయం తెలంగాణ..

శాంతి భద్రతలకు నిలయం తెలంగాణ రాష్ట్రమని, శాంతి భద్రతలు ఉంటేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతల మెరుగునకు పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత పోలీసుల సంక్షేమం కోసం రాష్ట్రం ఎన్నో నిధులను వెచ్చించిందన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు రావాలంటే ప్రధానంగా శాంతి భద్రతల సమస్య ఉండకూడదన్నారు. రెండోది విద్యుత్తు, మూడోది రోడ్ల సమస్య ఉండకూడదన్నారు. తెలంగాణలో ప్రస్తుతం ఆ మూడు సమస్యలను అధిగమించామన్నారు. అధికారులతో ఎప్పుడూ మర్యాదగానే నడుచుకుంటామన్నారు. శాంతి యుతంగా, ప్రజాస్వామ్య బద్ధంగానే తెలంగాణ ఉద్యమాన్ని నడిపి రాష్ట్రం సాధించుకున్నామని గుర్తు చేశారు. కేసీఆర్ సీఎం అయ్యాక సమాజంలో పోలీసులకు గౌరవం పెరిగిందన్నారు. కార్యక్రమంలో డీజీపీ అంజనీకుమార్, ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, నిజామాబాద్ సీపీ నాగరాజు, ఆర్మూర్ ఏసీపీ ప్రభాకర్‌రావు, ఎంపీపీ లావణ్య, జెడ్పీటీసీ దాసరి లావణ్య, సర్పంచ్ సునీత, ఆర్మూర్ రూరల్‌సీఐ గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

'పోలీసు వ్యవస్థను భ్రష్టు పట్టించారు'



ఆర్థిక సహాయం అందిస్తున్న షబ్బీర్ అలీ

బీబీపేట: రాష్ట్రంలో పోలీసు వ్యవస్థను పూర్తిగా భ్రష్టు పట్టించారని మాజీ మంత్రి మహ్మద్ షబ్బీర్ అలీ ఆరోపించారు. సోమవారం ఆయన మల్కాపూర్ గ్రామాన్ని సందర్శించారు. ఇటీవల మరణించిన అంబల్ల స్వామి కుటుంబ సభ్యులను పరామర్శించి బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. స్వామిని హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించారన్నారు. ఈ కేసులో అధికార పార్టీ నాయకులను కాపాడడానికి పోలీసులు ప్రయత్నాలు చేశారని ఆరోపించారు. ఘటన స్థలానికి వచ్చి కనీసం పంచనామా చేయకపోవడం దారుణమన్నారు. ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డికి ఫోన్ చేసి మాట్లాడారు. కేసును దర్యాప్తు చేసి నిందితులకు శిక్ష పడేలా చూడాలని కోరారు. బాధితులకు న్యాయం జరగకపోతే జిల్లా పోలీసు కార్యాలయం వద్ద దీక్ష చేస్తానని హెచ్చరించారు.

ఘనంగా కామదహనం



జిల్లాకేంద్రంలోని కాకతీయనగర్‌లో కామదహనం

జిల్లాలో సోమవారం కామదహనాన్ని ఘనంగా నిర్వహించారు. కొన్ని ప్రాంతాలలో హోలీ ఆడుకున్నారు. మిగతా ప్రాంతాలలో మంగళవారం హోలీ వేడుకను జరుపుకోనున్నారు.

క్లుప్తంగా

ఆడపిల్లలు ఎందులోనూ తక్కువ కాదు



ఎల్లారెడ్డి: ఆడపిల్లలు ఎందులోనూ తక్కువ కాదని పురుషులతో సమానంగా పోటీ పడుతున్నారని ఎల్లారెడ్డి మున్సిఫ్ కోర్టు న్యాయమూర్తి హారిక అన్నారు. సోమవారం పట్టణంలోని బాలాగౌడ్ ఫంక్షన్ హాల్‌లో జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల 68వ వార్షికోత్సవ కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. బాలికలు చదువులో రాణించి అనుకున్న లక్ష్యాన్ని సాధించాలని అన్నారు. మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ, ఎంపీపీ మాధవి, కవి, జాతీయ సాహిత్య పరిషత్ మాజీ అధ్యక్షుడు కసిరెడ్డి వెంకట్‌రెడ్డి తదితరులు మాట్లాడారు. అనంతరం విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. జెడ్పీటీసీ ఉషాగౌడ్, ఎంఈవో వెంకటేశం ఉన్నారు.

'బార్' ఎన్నికల అధికారుల నియామకం

ఖలీల్‌వాడి: నిజామాబాద్ బార్ అసోసియేషన్ 2023–24 సంవత్సరానికి ఎన్నికలు నిర్వహించడానికి ఎన్నికల ప్రధాన అధికారిగా డి వెంకటరమణగౌడ్, అసిస్టెంట్ ఎన్నికల అధికారిగా శైలేష్ కుమార్ దేష్ ముఖ్‌లను నియమించారు. ఈ మేరకు పత్రాలను బార్ ప్రధాన కార్యదర్శి నరేందర్ రెడ్డి వారికి అందజేశారు. సోమవారం బార్ అధ్యక్షుడు ఎర్రం గణపతి అధ్యక్షతన జరిగిన కార్యవర్గ సమావేశంలో ఈ మేరకు తీర్మానం ఆమోదించినట్లు తెలిపారు.

మున్సిపల్ కమిషనర్‌పై ఫిర్యాదు



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్‌పై చర్యలను తీసుకోవాలని కౌన్సిలర్లు ఆర్డీవో శ్రీను నాయక్‌కు సోమవారం వినతి పత్రం అందించారు. కమిషనర్ గత నెల 6 నుంచి విధులకు హాజరు కాక పోవడంతో మున్సిపాలిటీలో అభివృద్ధికి ఇబ్బందులు కలుగుతున్నాయని వారు విన్నవించారు. మున్సిపల్ కమిషనర్ రాక, ఇతరులకు బాధ్యతలు అప్పగించక పోవడంతో పట్టణంలో పనులకు ఆటంకం కలుగుతున్నదని అన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కమిషనర్‌పై చర్యలను తీసుకోవాలని కోరారు. కౌన్సిలర్లు పద్మ శ్రీకాంత్, నీలకంఠం, అల్లం శ్రీనివాస్ ఉన్నారు.

ట్యాక్స్ చెల్లించని వాహనాలు సీజ్ చేస్తాం



లింగంపేట: లింగంపేటలో సోమవారం కామారెడ్డి మోటారు వెహికిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ వాహనాల తనిఖీ నిర్వహించారు. వాహనదారులు రోడ్ టాక్స్ చెల్లించాలని సూచించారు. ట్యాక్స్ చెల్లించని వారి వాహనాలు సీజ్ చేస్తామన్నారు. కొంత మంది ట్యాక్స్ కట్టకుండా తప్పించుకుని తిరుగుతున్నారన్నారు. వారిని పట్టుకొని వాహనాలు సీజ్ చేయనున్నట్లు పేర్కొన్నారు.

చోరీ కేసులో పది నెలల జైలు శిక్ష

రాజంపేట: చోరీ కేసులో నిందితుడికి కామారెడ్డి జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ కోర్టు పది నెలల జైలు శిక్ష విధించింది. రాజంపేట మండలం పొందుర్తిలో గత జనవరిలో శంకర్ పాండురంగ రాథోడ్ దొంగతనం చేశాడు. నిందితుడిని కోర్టులో హాజరు పర్చగా పది నెలల జైలు శిక్ష, రూ.400 జరిమానా విధించినట్లు ఎస్సై రాజు తెలిపారు.

బియ్యం అప్పగించాల్సిందే!

- ఎఫ్‌సీఐకి నెలాఖరులోగా సీఎంఆర్ అందజేయాలి
- రైస్‌మిల్లుల్లో ధాన్యం నిల్వలు ఖాళీ
- పీడీఎస్ బియ్యం కొనుగోలు చేస్తున్న మిల్లర్లు



బాన్సువాడ డివిజన్‌లోని ఓ రైస్‌మిల్లులో పీడీఎస్ బియ్యం



రేషన్ బియ్యాన్ని రీసైక్లింగ్ చేస్తున్న దృశ్యం

బాన్సువాడటౌన్: కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన గడువు మేరకు ఈ నెల 31లోగా ఎఫ్‌సీఐకి సీఎంఆర్(కస్టమ్ మిల్లింగ్ రైస్) అప్పగించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులకు రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ నుంచి ఆదేశాలు వచ్చాయి. 2021–22 రబీకి సంబంధించి 12.61 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం మిల్లర్ల నుంచి రావాల్సి ఉంది. ఈ నెల 31న లోగా ఎఫ్‌సీఐకి బియ్యం అప్పగించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో మెజారిటీ రైస్‌మిల్లుల్లో ధాన్యం సంచులు ఖాళీ అయిన విషయం బహిరంగ రహస్యమే. కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించిన ధాన్యాన్ని మిల్లర్లు ఇతర రాష్ట్రాలకు తరలించి సొమ్ము చేసుకున్నారు. నకిలీ పత్రాలు సృష్టించి ఇతర ప్రాంతాలకు ధాన్యాన్ని తరలించారు. ప్రస్తుతం రైస్‌మిల్లుల్లో ధాన్యం బస్తాలు ఖాళీ అయ్యాయి. దీంతో ఆంధ్రప్రదేశ్, కర్ణాటక తదితర ప్రాంతాల నుంచి మిల్లర్లు పీడీఎస్ రైస్‌ను కొనుగోలు చేసి ఎఫ్‌సీఐకి పంపుతున్నారు. కొన్ని రైస్‌మిల్లులకు అధికారులే దగ్గరుండి పీడీఎస్ బియ్యాన్ని పంపిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

రేషన్ బియ్యం పంపించి దందా..

రీసైక్లింగ్ చేయాల్సిన పని లేదు. కరెంటు బిల్లులు లేవు. పీడీఎస్ బియ్యాన్ని దంపు చేసుకుని సంచుల్లో నింపి మళ్లీ లోడ్ చేసి ఎఫ్‌సీఐకి పంపిస్తు దందా కొనసాగిస్తున్నారు. ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా పంపిణీ చేస్తున్న బియ్యాన్ని అతి తక్కువ ధరకు ప్రజల వద్ద కొనుగోలు చేసి, తిరిగి సీఎంఆర్ పేరుతో ప్రభుత్వానికే అమ్ముతున్నారు. ఉమ్మడి జిల్లాలో చాలా రైస్‌మిల్లుల యజమానులు రేషన్ బియ్యాన్ని సీఎంఆర్‌కు పంపుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల బాన్సువాడ నియోజకవర్గంలోని వర్నీలో పెద్ద ఎత్తున పీడీఎస్ బియ్యాన్ని పౌరసరఫరాల అధికారులు పట్టుకున్న విషయం తెలిసిందే. జిల్లాలో మెజారిటీ మిల్లర్లు రూపాయి పెట్టుబడి లేకుండా కస్టం మిల్లింగ్‌లో చేతివాటం ప్రదర్శిస్తూ రూ.లక్షలు సంపాదిస్తున్నారు. బియ్యం అప్పగించకుండా ధాన్యం అమ్ముకున్న రైస్‌మిల్లులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని పౌరసరఫరాల సంస్థ చైర్మన్ రవీందర్‌సింగ్ అధికారులను హెచ్చరించిన విషయం తెలిసిందే. ధాన్యం మిల్లులో ఉందా? లేదా? గడువు ప్రకారం సీఎంఆర్‌కు అప్పగించారా? పెండింగ్ ఉన్న సీఎంఆర్ ఎంత? వంటి అంశాలతో పాటు, కరెంటు బిల్లులు, ఏబీ రిసిస్టర్‌ను తనిఖీ చేయాలని ఆదేశించారు.

కస్టమ్ మిల్లింగ్‌లో కాసుల వేట

మిల్లర్లకు పూచికత్తు లేకుండా ధాన్యం ఇవ్వడం, అధికారులు లెక్కలను పూర్తిస్థాయిలో పరిశీలించకపోవడంతో అవినీతి పేరుకుపోయింది. కొంత మంది మిల్లర్లు పరపతి ఉపయోగించి ఖరీఫ్‌లో 25 శాతం సన్నవడ్లను కేంద్రాల ద్వారా సేకరించి దొడ్డు వడ్ల రేటుతో క్వింటాలుకు రూ.1960 చెల్లించారు. ఆ వడ్లను బియ్యంగా మార్చి క్వింటాలుకు రూ.3500 నుంచి రూ.4 వేల వరకు అమ్ముకున్నారు. వాటి స్థానంలో ఇప్పుడు రేషన్ బియ్యం కొనుగోలు చేసి ఎఫ్‌సీఐకి పంపుతున్నారు. మిల్లర్లు సీఎంఆర్ కింద క్వింటాలు వడ్లకు 67 కిలోల బియ్యం ఇవ్వాలి. క్వింటాలు వడ్లు బయట అమ్మితే రూ.1700 వస్తున్నాయి. కిలో రూ.15కు రేషన్ బియ్యం కొన్నా 67 కిలోలకు రూ.1005 అవుతున్నాయి. ఇతర ఖర్చు రూ.95 కలిపినా క్వింటాలుకు రూ.1100 అవుతాయి. క్వింటాలుకు రూ.600 వస్తుండడంతో వ్యాపారులు ఈ దందా చేస్తున్నారు.

31లోగా అప్పగించాలి

రైస్‌మిల్లర్లు 2021–22 రబీకి సంబంధించిన సీఎంఆర్ బియ్యం ఈ నెలాఖరులోగా ఎఫ్‌సీఐకి అప్పగించాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయి. ఖరీఫ్‌కు మాత్రం గతంలోనే గడువు ఇచ్చారు. ప్రస్తుతం ఎలాంటి సమాచారం ఇవ్వలేదు. రబీకి సంబంధించిన బియ్యం మాత్రం ఈ నెలలో ఎఫ్‌సీఐకి అప్పగించాలని ఆదేశాలు అందాయి.

– సత్యనారాయణ, డీటీ, కామారెడ్డి

ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి



ప్రజావాణి ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ చంద్రమోహన్

కామారెడ్డి క్రైం: ప్రజావాణి ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ చంద్రమోహన్ అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 51 ఫిర్యాదులు వచ్చాయి. జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, ఏఓ రవీందర్, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు సాయి భుజంగరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అలుగు ఎత్తు తగ్గించాలి



అలుగు ఎత్తును తగ్గించాలని కోరుతూ ఎల్లారెడ్డి మండలం వెల్లుట్ల గ్రామానికి చెందిన పలువురు రైతులు సోమవారం ప్రజావాణికి తరలివచ్చారు. వారు మాట్లాడుతూ.. అధికారులు తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే గ్రామంలోని పెద్ద చెరువు అలుగును గత వేసవిలో రెండున్నర ఫీట్ల మేర పెంచారని తెలిపారు. దీంతో చెరువు వెనుక భాగంలో ఉన్న దాదాపు 70 ఎకరాలకు పైగా పట్టా భూములు నీట మునిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఏడాదిగా ఎలాంటి పంటలు సాగు చేసుకోలేకపోయామని వాపోయారు.

సమస్యలు పరిష్కరించాలి

పౌల్ట్రీ రైతుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఓన్ ఫార్మర్స్ బ్రాయిలర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రావు, ఉపాధ్యక్షుడు విఠల్‌రావు మాట్లాడుతూ.. ధర నిర్ణయించే అధికారం కార్పొరేట్ కంపెనీలకు కాకుండా రైతులకే కల్పించాలన్నారు. వ్యవసాయానికి ఇచ్చే విధంగా పౌల్ట్రీ రంగానికి ఉచిత కరెంటు ఇవ్వాలని కోరారు.



గల్ఫ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ఎంపీ అర్వింద్‌ను కలిసిన గల్ఫ్ కార్మికులు

బీబీపేట: తమ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరుతూ నిజామాబాద్ ఎంపీ అర్వింద్‌కు గల్ఫ్ కార్మికులు వినతి పత్రం అందజేశారు. ఇండియన్ పీపుల్స్ ఫోరం ఆధ్వర్యంలో దుబాయిలో నిర్వహించిన సుదూర తీరాన సిందూ కెరటాలు అనే బహిరంగ సభకి వెళ్లిన అర్వింద్‌ను వలస కార్మికులు కలిసి వినతి పత్రం అందజేశారు. విజిట్ వీసాపై వచ్చే కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఇండియన్ ఎంబసీ ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయనను కలిసిన వారిలో రాష్ట్ర కౌన్సిల్ కన్వీనర్ మహేందర్‌రెడ్డి, శరత్‌గౌడ్, కుంబాల విష్ణు, నవనీత్ గజే, అశోక్, సతీష్, గోవర్ధన్ యాదవ్, హరీష్, దేవయ్య ఉన్నారు.

ట్రాఫిక్ పోలీసులు, న్యాయవాది మధ్య వాగ్వాదం

ఖలీల్‌వాడి: నగరంలో ట్రాఫిక్ పోలీసులు, లాయర్‌కు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. సోమవారం బస్టాండ్ ప్రాంతంలో ట్రాఫిక్ పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో ఓ న్యాయవాది బైక్‌పై వెళ్తుండగా పోలీసులు ఆపారు. పోలీసులు సదరు న్యాయవాది వాహనం తాళం చెవి తీసుకోవడంతో వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో సదరు న్యాయవాది వాహనాన్ని ట్రాఫిక్ పోలీసులు తీసువెళ్లే ప్రయత్నం చేయడంతో న్యాయవాది ఆపారు. ఈ విషయమై న్యాయవాది బార్ అసోసియేషన్ కార్యవర్గం దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిసింది. బార్ అసోసియేషన్ సభ్యులు సీపీ నాగరాజు దృష్టికి తీసుకువెళ్లారు. బార్ అసోసియేషన్ సభ్యులతో ట్రాఫిక్ సీఐ మాట్లాడినట్లు సమాచారం. ఈ విషయాన్ని సీపీ దృష్టికి తీసుకు వెళ్తామని సీఐ చెప్పడంతో సమస్య సద్దుమణిగినట్లు తెలిసింది.

దివ్యాంగుల గుడిసెలు ధ్వంసం

ఎడపల్లి: మండలంలోని జానకంపేట శివారులో దివ్యాంగులు వేసుకున్న గుడిసెలను గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం రాత్రి ధ్వంసం చేశారు. గ్రామ సమీపంలో 22 మంది దివ్యాంగులకు ప్రభుత్వం స్థలాలు కేటాయించింది. ఈ స్థలాల్లో పక్కా ఇళ్లు మంజూరు అయ్యేంత వరకు గుడిసెలు వేసుకొని నివసిస్తామని ఇటీవల గుడిసెలు వేసుకున్నారు. వీటిని ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ఈ విషయమై దివ్యాంగులు తహసీల్దార్ శేఖర్‌ని కలిసి వివరించారు.

గోదాముల సంఖ్య పెంచాలి



బోధన్‌లోని సీడబ్ల్యూసీ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న రైస్‌మిల్ అసోసియేషన్ సభ్యులు

బోధన్‌టౌన్: బోధన్, బాన్సువాడ ప్రాంతాల్లో ఉన్న 220పైగా రైస్‌మిల్లులకు అనుగుణంగా గోదాముల సంఖ్యను పెంచాలని బాన్సువాడ డివిజన్, బోధన్ తాలూకా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. సోమవారం బోధన్‌లోని సీడబ్ల్యూసీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి ఆందోళనకు దిగారు. అనంతరం మేనేజర్‌కు వినతి పత్రం అందించారు. గతేడాది యాసింగికి సంబంధించిన సీఎంఆర్ బియ్యాన్ని ఈనెల 31 వరకు ఎఫ్‌సీఐకి అప్పగించాలని అధికారులు టార్గెట్ విధించారన్నారు. రైస్‌మిల్లర్లకు ఇచ్చిన సీఎంఆర్ రైస్ పంపిస్తున్నా గోదాముల్లో కెపాసిటీ లేక పోవడంతో పాటు హమాలీల కొరత ఉండడంతో లోడ్ దించుకోవడం లేదని చెప్పారు. లారీలు 10 నుంచి 20 రోజులు ఉంటున్నాయని దీంతో రూ.లక్షల్లో నష్టం వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. సీడబ్ల్యూసీ గోదాముల్లో 38 వేల టన్నుల కెపాసిటీ మాత్రమే ఉందని, లక్ష టన్నుల వరకు రైస్‌మిల్లర్స్ వద్ద సీఎంఆర్ ఉన్నాయని దానికి అనుగుణంగా గోదాముల వసతి కల్పించాలన్నారు. రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సాంబిరెడ్డి, బాన్సువాడ డివిజన్ రైస్‌మిల్లర్స్ అధ్యక్షుడు సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న పీజీ సెమిస్టర్ పరీక్షలు



పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న రిజిస్ట్రార్ విద్యావర్ధిని, ప్రిన్సిపాల్ ఆరతి

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో సోమవారం జరిగిన పీజీ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగినట్లు కంట్రోలర్ అరుణ తెలిపారు. ఉదయం జరిగిన ఎంబీఏ, ఎంసీఏ మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలో 462 మంది విద్యార్థులకు 435 మంది హాజరు కాగా 27మంది గైర్హాజరైనట్లు తెలిపారు. మధ్యాహ్నం జరిగిన ఎంబీఏ, ఎంసీఏ మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలో 562 మందికి 528 పరీక్ష రాశారు. ఉదయం జరిగిన ఎల్ఎల్‌బీ మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షల్లో 36 మంది విద్యార్థులకు 24 మంది, మధ్యాహ్నం జరిగిన ఎల్ఎల్‌బీ ఐదో సెమిస్టరు పరీక్షలో 24 మంది 21 మంది హాజరైనట్లు వివరించారు. క్యాంపస్‌లోని కంప్యూటర్ సైన్స్ కాలేజీ పరీక్షా కేంద్రాన్ని ఇన్‌చార్జి రిజిస్ట్రార్ బి విద్యావర్ధిని, ప్రిన్సిపాల్ సీహెచ్ ఆరతి పరిశీలించారు.

నిందితుడి ఇంటి ఎదుట మృతదేహంతో ధర్నా



షహనాబి(ఫైల్)



ధర్నా చేస్తున్న మృతురాలి బంధువులు

వర్ని: మండలంలోని బడాపహాడ్‌లో ఆదివారం రాత్రి హత్యకు గురైన షహనాబి మృతదేహంతో నిందితుడి ఇంటి ఎదుట ఆమె బంధువులు సోమవారం ధర్నా చేశారు. మండలంలోని జలాల్పూర్ గ్రామంలో షహనాబి మృతదేహంతో నిందితుడు షేక్ నిజాం ఇంటి వద్ద ఆందోళన చేశారు. షహనాబి చనిపోవడంతో ఆమె ఇద్దరు కూతుర్లు అనాథలయ్యారని, వారి బాగోగులు నిందితుడి కుటుంబ సభ్యులు చూసుకోవాలని డిమాండ్ చేశారు. మృతురాలి కుటుంబానికి పరిహారం ఇవ్వాలన్నారు. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు ఆందోళన కొనసాగించారు. పోలీసులు వచ్చి నచ్చచెప్పే యత్నం చేసిన ఆందోళన విరమించలేదు. కుల పెద్దలు, గ్రామస్తులు కుటుంబానికి అండగా ఉండి ఆదుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

క్రైం కార్నర్

రూ.2500 కోసం గొడవ

- కల్లుబట్టీలో ఒకరి హత్య



ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఏసీపీ కిరణ్‌కుమార్, సీఐ

ఖలీల్‌వాడి: నగరంలోని నాగారం పాత కల్లు బట్టీలో ఒకరు హత్యకు గురయ్యారు. నార్త్ సీఐ నరహరి తెలిపిన వివరాలు.. నాగారం ప్రాంతానికి చెందిన వట్టేవార్ యాదు(40), అదే కాలనీకి చెందిన విక్రమ్ సింగ్ సోమవారం ఉదయం స్థానిక బెల్ట్‌షాపులో మద్యం కొనుగోలు చేసుకోని కల్లుబట్టీలో తాగారు. మద్యం తాగే సమయంలో విక్రమ్ సింగ్‌ను తనకు బాకీ ఉన్న రూ.2500 ఇవ్వాలని యాదు అడిగారు. దీంతో ఇద్దరి మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. దీంతో విక్రమ్‌సింగ్ అక్కడే ఉన్న రాడుతో యాదును కనతపై కొట్టడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. హత్య జరిగిన ప్రాంతాన్ని ఏసీపీ కిరణ్‌కుమార్ పరిశీలించారు. హత్య వివరాలను నార్త్‌సీఐ నరహరిని అడిగి తెలుసుకున్నారు. విక్రమ్‌సింగ్ పోలీసుల వద్దకు వెళ్లి లొంగిపోయినట్లు తెలిసింది. మృతుడి కుటుంబం మహారాష్ట్రలోని నాందేడ్‌లో ఉంటుంది. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

కట్నం కోసం వేధించిన వారిపై కేసు

సిరికొండ:అదనపు కట్నం కోసం వివాహితను వేధించిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నర్సింలు సోమవారం తెలిపారు. మండలంలోని గడ్కోల్ గ్రామానికి చెందిన గంగరాణిని కామారెడ్డి జిల్లా గర్గుల్ గ్రామానికి చెందిన రవీందర్‌రెడ్డికి ఇచ్చి వివాహం జరిపించారు. వారికి ఒక బాబు ఉన్నాడు. రూ.పది లక్షలు అదనపు కట్నం తేవాలని గంగరాణిని ఆమె భర్త కొట్టి పుట్టింటికి పంపించాడని ఎస్సై తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు భర్త, అత్తమామలు, ఆడపడుచులపై వరకట్న వేధింపుల కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

హత్యాయత్నం కేసులో పదేళ్ల జైలు

సిరికొండ: మండలంలోని తూంపల్లి గ్రామానికి చెందిన ఎనుగంటి సాయిలు అలియాస్ కరీంకు పదేళ్ల జైలు శిక్ష, రూ.1500 జరిమానా విధిస్తు ఆర్మూర్ సీనియర్ సివిల్ జడ్జి నసీమ సుల్తానా తీర్పు వెలువరించారని ఎస్సై నర్సింలు తెలిపారు. గత ఆగస్టులో అదే గ్రామానికి చెందిన సత్తూరి పుష్ప అనే మహిళను వేధిస్తు ఆమెపై కక్ష్యతో అక్రమంగా ఇంటిలోకి చొరబడి కత్తితో హత్యాయత్నం చేశాడని తెలిపారు. అప్పటి ఇన్‌చార్జి ఎస్సై వంశీకృష్ణరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారని చెప్పారు. కేసులో తొమ్మిది మంది సాక్షులను విచారించి ప్రాసిక్యూషన్ తరపున అడిషనల్ పీపీ అవారి రమేష్ వాదనలు వినిపించగా అసిస్టెంట్ సెషన్ జడ్జి ఈ తీర్పు వెలువరించారని ఎస్సై తెలిపారు.

మనస్తాపంతో మహిళ ఆత్మహత్య

రుద్రూర్: రుద్రూర్ మండలం అంబం (ఆర్) గ్రామ చెరువులో దూకి మహిళ ఆత్మహత్య చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. రుద్రూర్ గ్రామానికి చెందిన మదారి అనురాధ అలియాస్ వసంత (32) భర్త నెలన్నర క్రితం ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో కొంతకాలంగా పుట్టినిల్లు అంబం (ఆర్)లో ఉంటుంది. ఆమెకు పదేళ్లలోపు ఇద్దరు పిల్లలు ఉన్నారు. భర్త లేకపోవడంతో పిల్లల భవిష్యత్తుపై బెంగతో ఉండేది. ఈ క్రమంలో మనస్తాపానికి గురై అనురాధ చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లుగా భావిస్తున్నారు. మృతురాలి తండ్రి మక్కయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్సై రాజు తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్లు, సోలార్ బ్యాటరీలు చోరీ



దొంగలు ధ్వంసం చేసిన ట్రాన్స్‌ఫార్మర్

గాంధారి: గాంధారి శివారులో వ్యవసాయ బోరుబావుల వద్ద నుంచి ట్రాన్స్‌ఫార్మర్లు, అడవి పందులు, కోతుల నుంచి పంటలు రక్షించుకోడానికి అమర్చిన సోలార్ బ్యాటరీలను దొంగలు ఎత్తుకెళ్తున్నారు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఆదివారం రాత్రి గాంధారి శివారులోని చౌదరి పల్లె వ్యవసాయ బోరు బావి వద్ద నుంచి గంద్యాటం సంగయ్యకు చెందిన ట్రాన్స్‌ఫార్మరుతో పాటు అదే ప్రాంతంలో బ్రాహ్మణ్‌పల్లి గ్రామానికి చెందిన మరో రైతుకు చెందిన ట్రాన్స్‌ఫార్మరును ధ్వంసం చేసి అందులో నుంచి పరికరాలను ఎత్తుకెళ్లారు. గాంధారికి చెందిన రైతులు ముస్తఫా, గౌస్, మంగలి కిష్టయ్య, చిరుకూరి విఠల్ పొలాల వద్ద అమర్చుకున్న సోలార్ బ్యాటరీలను దుండగులు దొంగిలించారు.ట్రాన్స్‌ఫార్మర్ల చోరీపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ట్రాన్స్‌కో ఏఈ సతీష్ రెడ్డి తెలిపారు.

పందిమడుగులో ద్విచక్రవాహనం..

సిరికొండ: మండలంలోని పందిమడుగు గ్రామానికి చెందిన సుంకరిపల్లి సాయన్న ద్విచక్రవాహనం చోరీ అయిందని ఎస్సై నర్సింలు సోమవారం తెలిపారు. తన ఇంటి ముందు నిలిపి ఉంచిన స్కూటీ శనివారం రాత్రి చోరీకి గురైందని బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

వాకింగ్‌కు వెళ్లి వస్తుండగా..

- గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడి మృతి



రోషన్ మృతదేహం

నస్రుల్లాబాద్: వాకింగ్‌కు వెళ్లి వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడు మృతి చెందాడు. బీర్కూర్ మండల కేంద్రానికి చెందిన రోషన్ రోజూ మాదిరిగా సోమవారం తన తండ్రి గణేశ్‌తో కలిసి వాకింగ్‌కు వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో తండ్రి ఇంటికి ముందుగా చేరుకున్నాడు. రోషన్ రాక పోయే సరికి ఆరా తీయగా గుర్తు తెలియని వాహనం ఢీకొని రోడ్డు పక్కన విగత జీవిగా కనిపించాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కాలువలో మహిళ మృతదేహం



సైదవ్వ (ఫైల్)

రుద్రూర్: మండలంలోని అక్బర్‌నగర్ గ్రామానికి చెందిన సైదవ్వ (55) మృతదేహం రాయకూర్ శివారులోని నిజాంసాగర్ కాలువలో సోమవారం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాలు.. అక్బర్‌నగర్‌కు చెందిన బురిగెడి సైదవ్వ(55)కు కల్లు తాగే అలవాటు ఉంది. ఈ నెల 4న కల్లు తాగడానికి వర్ని వెళ్లి తిరిగిరాలేదు. సీసీ కెమెరాల్లో పరిశీలించగా బైక్‌పై గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు తీసుకెళ్లినట్లు గుర్తించారు. దీంతో సైదవ్వ కుటుంబ సభ్యులు రుద్రూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సోమవారం సాగర్ కాలువలో ఆమె మృతదేహం కనిపించింది. సైదవ్వను కిడ్నాప్ చేసి ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాలు తీసుకుని హత్య చేసి కాలువలో పడేసి ఉంటారని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారు ఢీకొని ఒకరి మృతి



నర్సింలు మృతదేహం

జిన్నారం(పటాన్‌చెరు): వేగంగా వస్తున్న కారు అదుపు తప్పి.. ఎదురుగా ఉన్న బైక్‌ను ఢీకొట్టింది. ఆదివారం రాత్రి జరిగిన ఈ ఘటనలో ఒకరు మృతి చెందారు. జిన్నారం ఎస్సై విజయకృష్ణ కథనం ప్రకారం.. కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట మండలం వెంకంపల్లి గ్రామానికి చెందిన పుట్టి నర్సింలు(40) హైదరాబాద్ నుంచి బైక్‌పై సొంత గ్రామానికి బయలు దేరాడు. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలంలోని నల్లవల్లి ప్రధాన రహదారి మేడలమ్మ ఆలయ సమీపంలో కారు అదుపు తప్పి బైక్‌ను ఢీకొట్టింది. దీంతో నర్సింలుకు తీవ్ర గాయాలు కాగా, ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి భార్య నాగమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

చెరువులో మునిగి బాలుడి మృతి



శ్రీకాంత్ మృతదేహం

నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ రూరల్ మండలం ధర్మారం తండా చెరువులో మునిగి కేతావత్ శ్రీకాంత్(12) మృతి చెందాడు. తండాకు చెందిన కేతావత్ అశోక్ కవితకు ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు శ్రీకాంత్ ఉన్నారు. బాలుడు గ్రామంలోనే ప్రభుత్వ పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్నాడు. సోమవారం బడి నుంచి రాగానే తన స్నేహితులతో కలిసి గ్రామ సమీపంలో గల చెరువు వద్దకు స్నానానికి వెళ్లాడు. చెరువులో స్నానం చేస్తుండగా జేసీబీతో తవ్విన గుంతలో పడి మునిగిపోయాడు. దీనిని గమనించిన స్నేహితులు గ్రామంలోకి వెళ్లి విషయాన్ని తెలుపటంతో వారు చెరువు వద్దకు చేరుకుని బాలుడిని బయటకు తీశారు. అనంతరం నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఒక్కగానొక్క కొడుకు మృతిచెందటంతో తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు. రూరల్ ఎస్సై లింబాద్రి ఆస్పత్రికి చేరుకుని కేసు నమోదు చేసుకున్నారు.